# నమస్తే ఉదయం


తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 83 | పేజీలు: 4 | వెల: 4/- | మంగళవారం • 15, అక్టోబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## ఇండియన్ కోస్ట్‌గార్డ్ కొత్త చీఫ్‌గా ఎస్ పరమేష్



**న్యూఢిల్లీ,అక్టోబర్14(నమస్తే ఉదయం):** భారత తీర రక్షక దళం ఇండియన్ కోస్ట్‌గార్డ్ కొత్త చీఫ్‌గా ఎస్ పరమేష్‌ను నియమిస్తున్నట్లు భారత ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఈయన అక్టోబరు 15న అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నారు. గత నెలలో పూర్వపు చీఫ్ డిజి రాకేష్ పాల్ గుండెపోటుతో మరణించగా.. పరమేష్ ప్రస్తుతం డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కొత్త చీఫ్ పరమేష్ న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కాలేజీ విద్యార్థి. ఈయనకు మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. భూమిపై, సముద్రంలో వివిధ హోదాల్లో పనిచేశారు. అధునాతన ఆఫ్‌షోర్ పెట్రోల్ వెసెల్ సమర్, ఆఫ్‌షోర్ పెట్రోల్ వెసెల్ విశ్వాస్ట్ వంటి ప్రధాన నౌకలకు నాయకత్వం వహించారు. ఈయన కోస్ట్ గార్డ్ రీజియన్స్ ఈస్ట్, వెస్ట్‌లకూ నాయకత్వం వహించారు.



## ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

### సమాజ శ్రేయస్సులో సంస్థల పాత్ర

**స్టాక్‌మోమ్,అక్టోబర్14(నమస్తే ఉదయం):**

**ఆర్థికశాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ బహుమతి వరించింది. రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఈ అవార్డును ప్రకటించింది. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన డారన్ ఏస్‌మోగ్లు, సిమన్ జాన్సన్, యూనివర్సిటీ ఆఫ్ చికాగోకు చెందిన జేమ్స్.ఎ.రోబిన్‌సన్‌లకు ఈ యేటి ఎకనామిక్స్ నోబెల్ దక్కింది.**

సమాజ శ్రేయస్సును నిర్ణయించడంలో సంస్థల పాత్రపై వీరు చేసిన అధ్యయనానికి గానూ నోబెల్ బహుమతి దక్కింది. గతేడాది కూడా ఆర్థిక శాస్త్రంలో ముగ్గురికి నోబెల్ పురస్కారం దక్కింది. బెన్ ఎస్ బెర్నాంకి, డగ్లస్ డబ్ల్యూ. డైమండ్, ఫిలిప్ హెచ్.దిబ్విగ్‌లు నోబెల్‌ను అందుకున్నారు. బ్యాంకులు, ఆర్థిక సంక్షోభాలపై ఈ ముగ్గురు పరిశోధనలు చేశారు. ఆర్థిక సంక్షోభాల వేళ బ్యాంకుల పాత్ర

➤ మిగతా 02లో..

## నగర ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడేనా?



### రోజురోజుకు పెరుగుతున్న వాహనాలు - ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులు

**హైదరాబాద్,అక్టోబరు 14(నమస్తే ఉదయం):**

**హైదరాబాద్ నగరం విస్తరించడంతో పాటు, శివారు గ్రామాలు అన్నీ నగరంలో కలసిపోతున్నాయి. దీనికితోడు గ్రామాల్లో ఉపాధి లేక ప్రజలు బతుకుదెరువు కోసం పట్టణాలకు వలస వస్తున్నారు. దీనికితోడు టూ వీలర్, కార్లు తప్పనిసరిగా కొనుగోలు చేస్తున్నారు. వీటి ఉపయోగం పెరుగుతోంది. కరోనా తరవాత సొంత వాహనాల్లో వెళ్లడం అలవాటు చేసుకున్నారు. మెట్రో అందుబాటులోకి వచ్చినా ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడడం లేదు.**

మరోవైపు హైదరాబాద్ నగరం విస్తరించడంతో పాటు, అందుకు మించి అన్నట్లుగా నిత్యం ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. నగర రోడ్లపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. ఓ గంటలో గమ్యం చేరుకుంటామన్న భరోసా కలగడం లేదు. పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యతో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయలేక పోతున్నారు. దీనికితోడు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విషయంలో పోలీసులు అలసత్వం కూడా తోడవుతోంది. దీంతో నిత్యం నగర జీవనం దుర్భరంగా మారుతోంది. అంబులెన్సులు కూడా పరుగెత్తలేని పరిస్థితి ఏర్పడింది. శని,ఆదివారాల్లో కడూఆ ట్రాఫిక్ తగ్గడం లేదు. మెహదీపట్నం నుంచి ఐటి కారిడార్‌కు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు ఉన్నాయి. వేలాది ఐటీ కంపెనీలు.. రోజుకు సుమారు 15,20 లక్షల మంది వాహనదారులు రాకపోకలు సాగించే అత్యధిక రద్దీ ప్రాంతం.. కావడంతో ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ కష్టాలకు కొదువ లేదు. దీనికి చెక్ పెట్టడానికి సైబరాబాద్ పోలీసులు అనేక కార్యక్రమాలను


➤ మిగతా 02లో..

## ప్రధాని మోడీతో అతిషి భేటీ



### ›› సీఎంగా బాధ్యతలు చేపట్టాక కలిసినట్లు వెల్లడి

**న్యూఢిల్లీ,అక్టోబర్14(నమస్తే ఉదయం):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ ముఖ్య మంత్రి అతిషి సోమవారం నాడు కలుసుకున్నారు. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆమె ప్రధానిని కలుసుకున్నారు. సమావేశం ఎజెండా ఏమిటనేది మాత్రం వెంటనే తెలియలేదు. ఢిల్లీ ముఖ్యమంత్రి నివాసం కేటాయింపుపై లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు, ప్రభుత్వానికి మధ్య మాటల యుద్ధం నడుస్తున్న తరుణంలో ప్రధానితో అతిషి సమావేశం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రధానిని ఢిల్లీ సీఎం కలుసుకున్నట్టు పీఎంఓ ఒక ట్వీట్‌లో ధ్రువీకరిం చింది. అయితే ఇంతకు మించిన సమాచారం ఏదీ తెలియజేయలేదు. ప్రధానితో సమావేశమైనట్టు 'ఎక్స్' వేదకగా అతిషి తెలిపారు. ఢిల్లీ అభివృద్ధికి, సంక్షేమానికి కేంద్రం సహకరిస్తుందని ఆశిస్తున్నట్టు పేర్కొ న్నారు.



## పెట్టుబడులు పెట్టే కంపెనీలకు ప్రోత్సాహం


### ఫాక్స్‌కాన్ కంపెనీ పురోగతిని పరిశీలించిన సీఎం రేవంత్



**హైదరాబాద్,అక్టోబర్14(నమస్తే ఉదయం):**
తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే కంపెనీలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో సంస్థలకు ఎలాంటి అనుమానాలు అక్కరలేవన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ శివారు కొంగరకలాన్‌లోని ఫాక్స్ కాన్ కంపెనీని సోమవారం సాయంత్రం సందర్శించారు. తెలంగాణలో మరిన్ని విభాగాల్లో పెట్టబడులకు ఫాక్స్ కాన్ ప్రతినిధులను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో సమావేశమై కంపెనీ పురోగతి, ఇతర అంశాలను సీఎం రేవంత్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రాష్ట్రంలో ఫాక్స్ కాన్ కంపెనీకి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనలో అన్ని విధాలుగా సహకరిస్తామని స్పష్టం చేశారు.

## మోండా మార్కెట్‌లో ముత్యాలమ్మ విగ్రహం ధ్వంసం

- స్థానికుల ధర్నాతో కుమ్మరిగూడలో ఉద్రిక్తత
- ఆలయాన్ని సిపితో కలసి సందర్శించిన కిషన్ రెడ్డి




**హైదరాబాద్,అక్టోబరు 14(నమస్తే ఉదయం):**
సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్ సమీపంలోని కుమ్మరిగూడలో ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహం ధ్వంసమైంది. దీంతో స్థానికంగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసమైందని ఉదాయన్నే తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున చేరుకొని ఆందోళన చేపట్టారు.

➤ మిగతా 02లో..

## గంగానదికి ఒక న్యాయం... మూసీకి ఒక న్యాయామా?

- మూసీ నదికి మరణశాసనం రాస్తూ.. సుందరీకరణ ప్రాజెక్టా?
- వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణంతో మూసీ అంతర్ధానం
- పదేళ్లు మాపై ఒత్తిడి తెచ్చిన రాడార్ స్టేషన్ నిర్మాణానికి అంగీకరించలేదు
- జనావాసాలు లేని ద్వీపాల్లో ఏర్పాటు చేయాల్సిన రాడార్ తెలంగాణలోనా?
- ఏ ప్రయోజనాలు ఆశించి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారు.
- గంగానది జన్మస్థానం వద్ద 150 కిలోమీటర్లు ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించారు.
- రాడార్ ఏర్పాటుకు వ్యతిరేకంగా పర్యా వరణ వేత్తలతో కలిసి పోరాటం చేస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్,అక్టోబరు 14(నమస్తే ఉదయం):**
వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో నేవీకి సంబంధించిన వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణం ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నట్లు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఓ వైపు మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ పేరుతో లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతూనే మరోవైపు మూసీ నదిని పూర్తిగా ప్రమా దంలో పడేసే ర్డాడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలపటమేమిటనీ కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదెక్కడి ద్వంద్వ వైఖరంటూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఏం ప్రయోజనాలు ఆశించి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం అనగా తేదీ 15-10-2024 రోజున కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ఈ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేస్తుండటాన్ని బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు.

దామగుండంలో రాడార్ ఏర్పాటు కారణంగా పర్యావరణానికి తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని కేటీఆర్ చెప్పారు. దాదాపు 2900 ఎకరాల అటవీ భూభాగంతో పాటు 12 లక్షల చెట్లను నరికి వేసి ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టనున్నారన్నారు. జనవాసాలే లేని చోట ఏర్పాటు చేయాల్సిన రాడార్ కేంద్రాన్ని ఎందుకు తెలంగాణలో నిర్మిస్తున్నారో చెప్పాలన్నారు.

➤ మిగతా 02లో..

## హైడ్రా ఆగితే.. హైదరాబాద్ మరో వయనాడ్


- కాంగ్రెస్ ప్రభుత్వం మీద బిజెపి, బిఆర్ఎస్ దుష్ప్రచారం
- సాధ్యమైనంత తొందరగా లోకల్ బాడి ఎన్నికల నిర్వహణ
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు



**నిజామాబాద్,అక్టోబర్14(నమస్తే ఉదయం):**
ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా ఆగిపోతే.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మరో వయనాడ్ అవుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా అంశంలో వెనక్కి తగ్గేది లేదని.. హైడ్రా, మూసీ ప్రక్షాళన నిరంతరంగా కొనసాగుతోందని తేల్చి చెప్పారు.

➤ మిగతా 02లో..

## బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ పాలన



- ›› తక్కువ కాలంలోనే అప్రతిష్ట మూటకట్టుకున్న రేవంత్
- ›› మూసీ పేరుతో పేదల ఇళ్లు కూలగొడుతున్నారు
- ›› నవంబర్ 1నుంచి బిజెపి ఉద్యమబాటు పడుతుంది
- ›› కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,అక్టోబర్14(నమస్తే ఉదయం):**
నవంబర్ 1 నుంచి బీజేపీ ఉద్యమ బాట పట్టనుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత 10 సంవత్సరాల పాలనలో గత ప్రభుత్వాలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాయని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబ పాలనలో రాష్ట్రం వెనుకబడిందన్నారు. రాష్ట్రంలో ఎలాంటి సంక్షేమ సరిగా పథకాలు అమలు కాలేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ తరహాలోనే వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి విమర్శించారు. ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2014 లో బీజేపీ సభ్యత్వ సేకరణ తర్వాత 2024 లో చేస్తున్నామన్నారు. సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశానికి హాజరైన మంత్రి మాట్లాడారు. నూతనంగా గ్రామీణ మండల జిల్లా వ్యాప్తంగా నూతన కమిటీ సేకరణ ఏర్పాటు చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు కట్టకుండా పేదల ఇళ్లను కూల్చేన్న ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీదన్నారు. అతి తక్కువ

➤ మిగతా 02లో..



## వైవిధ్య వాతావరణం ప్రజలు ఉక్కిరిబిక్కిరి

- ›› గ్లోబల్ వార్మింగ్, క్యుములోనింబస్ మేఘాల ప్రభావం
- ›› అప్పుడే ఎండ..అప్పుడే వానల పరిస్థితి
- ›› అడపాదడపా తప్పని కరెంట్ కోతలు

**హైదరాబాద్,అక్టోబరు 14(నమస్తే ఉదయం):**
అక్టోబర్ నెలలో సాధారణంగా చలి ఉండాలి. కానీ ఇప్పుడు భిన్నమైన వాతావరణంతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. ఉక్కపోతులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదయం ఎండలు దంచేస్తుంటే.. సాయంత్రం

➤ మిగతా 02లో..

# నగర ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడేనా?

(మొదటి పేజీ తరువాయి)

చేపడుతున్నారు. తాజాగా ఐటీ కంపెనీలు ఎక్కువగా ఉన్న, అత్యధికంగా వాహనాల రాకపోకలు సాగించే ముఖ్యమైన జంక్షన్ల వద్ద సిగ్నల్ ఫ్రీ, ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పుడున్న రోడ్లను విస్తరించి, ప్రత్యేకంగా ఫ్రీ లెఫ్ట్ వెళ్లడానికి సరిపడా రోడ్లను విస్తరిస్తున్నారు. గచ్చిబౌలి ఐటీ జంక్షన్ వద్ద గచ్చిబౌలి పీఎస్ ఎంట్రెన్స్ నుంచి పోలీస్‌స్టేషన్‌లో పార్కింగ్ స్థలాన్ని తొలగించి ఐఐటీ జంక్షన్ వరకు అతిపెద్ద రోడ్డును విస్తరిస్తున్నారు. దాంతో సైబరాబాద్ సీపీ కార్యాలయం, ఓఆర్ఆర్ నుంచి గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు వెళ్లేవారు ఐఐఐటీ జంక్షన్ వద్ద సిగ్నల్ కోసం ఆగాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక రోడ్డును నిర్మిస్తున్నారు. అంతేకాకుండా హెచ్‌సీయూ నుంచి వచ్చే ట్రాఫిక్ ఐఐఐటీ జంక్షన్ వద్ద ఆగకుండా లెఫ్ట్‌వెళ్లేవారు, నేరుగా వెళ్లేవారు సిగ్నల్ కోసం కాకుండా, జంక్షన్ వద్ద వాహనాలు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి రాయదుర్గం వైపు వెళ్లాలనుకునేవారు. ఐఐఐటీ వద్ద లెఫ్ట్ తీసుకొని, స్టేడియం వద్ద యూటర్న్ తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా రాయదుర్గం నుంచి షేక్‌పేట్ ఫ్లైఓవర్ వరకు, ఐకియా నుంచి హైటెక్‌సిటీ వరకు అక్కడ నుంచి మాదాపూర్ యశోద ఆస్పత్రి వరకు సిగ్నల్ ఫ్రీ, ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్లు అందించడానికి జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నారు. బయోడైవర్సిటీ వద్ద సిగ్నల్ ఫ్రీ జంక్షన్ ఏర్పాటు చేసి ఎలా సక్సెస్ అయ్యారో ముఖ్యమైన జంక్షన్ల వద్ద అదే పద్ధతి కొనసాగించడానికి పోలీసులు కసరత్తు చేస్తున్నారు. మరో 20 రోజుల్లో సిగ్నల్ ఫ్రీ, ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ నియంత్రణ, క్రమబద్ధీకరణ కు ఇప్పటికే హైరైజ్ కెమెరాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఎక్కడ ఏ చిన్న ట్రాఫిక్ జామ్ ఏర్పడినా, వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా వెంటనే ట్రాఫిక్ పోలీసులకు తెలిసేలా కెమెరాలను సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పబ్లిక్ సేఫ్టీ ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్ సెంటర్ (పీఎస్ ఐవోసీ)కి అనుసంధానం చేశారు. అక్కడి నుంచి సిబ్బంది




ట్రాఫిక్‌ను మానిటరింగ్ చేస్తారు. ట్రాఫిక్ జాయింట్ సీపీ సైతం పరిస్థితిని సమీక్షించేలా ఆయన కార్యాలయానికి కనెక్ట్ చేశారు. ఇటీవల భారీ వర్షాలు వచ్చినప్పుడు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టి సక్సెస్ అయ్యారు. ఇప్పుడు సిగ్నల్ ఫ్రీ జంక్షన్ల ఏర్పాటు సైతం సత్ఫలితాలు ఇస్తాయని, ఎన్నాళ్లుగానో ఉన్న ఐటీ కారిడార్ ట్రాఫిక్ కష్టాలు తీరిపోతాయని సైబరాబాద్ ట్రాఫిక్ ఉన్నతాధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపోతే నగరంలోని కేబీఆర్ పార్క్ చుట్టూరా సిగ్నల్ ఫ్రీ ప్రయాణాలు సాగేలా అండర్‌పాస్‌లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తున్నది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 వైపు నుంచి కేబీఆర్ పార్కు ప్రధాన గేటు వైపు 740 మీటర్ల మేర అతిపెద్ద భూగర్భ మార్గం నిర్మించనున్నారు. దీంతో ఐటీ కారిడార్, ఫిల్మ్‌నగర్ వైపు నుంచి వచ్చే వాహనాలు జూబ్లీ చెక్‌పోస్ట్ కంటే ముందు ఉండే అండర్‌పాస్ నుంచి సిగ్నల్ చిక్కులు లేకుండా రాకపోకలు సాగించే వెసులుబాటు కలగనుంది. మూడు లేన్లుగా అండర్ పాస్ నిర్మాణానికి రూపకల్పన చేశారు. అలాగే సిగ్నల్ చిక్కులు లేకుండా జంక్షన్ల వారీగా బహుళ మార్గాలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. జూబ్లీ చెక్‌పోస్ట్ వద్ద మాత్రం రెండో లెవల్‌లో ఓ వంతెన ప్రతిపాదించారు. కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ చౌరస్తా వద్ద రూ.192 కోట్లతో రెండు అండర్‌పాస్‌లు, ఓ వంతెన ప్రతిపాదించారు. యూసుఫ్‌గూడ వైపు నుంచి వచ్చే వాహనాలు మూడు లేన్ల వంతెన నుంచి జూబ్లీచెక్‌పోస్ట్ వైపు వెళ్లనున్నాయి. జూబ్లీచెక్‌పోస్ట్ నుంచి వచ్చే వాహనాలు ఫ్రీ లెఫ్ట్ ద్వారా యూసుఫ్‌గూడ వైపు, కేన్సర్ ఆస్పత్రి వైపు వెళ్లాల్సిన వాహనాలు అండర్‌పాస్ వినియోగించాల్సి ఉంటుంది. జూబ్లీచెక్‌పోస్ట్ వద్ద రెండు వంతెనలు, ఓ అండర్‌పాస్ నిర్మించనున్నారు. ఇందుకు రూ.229 కోట్లు అవసరమని అంచనా వేశారు. కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ వైపు నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ ?36 (పెద్దమ్మ గుడి వైపు) మూడు లేన్ల చొప్పున రెండు వైపులా వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఆరు లేన్ల వంతెన అందుబాటులోకి రానుంది. రోడ్ నెంబర్?45 వైపు నుంచి కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ వైపు వెళ్లేందుకు మూడు లేన్ల అండర్‌పాస్, యూసుఫ్‌గూడ వైపు వాహనాల కోసం మరో అండర్‌పాస్ ప్రతిపాదించారు. కేన్సర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద ఓ అండర్‌పాస్, ఓ వంతెనను రూ.83 కోట్లతో ప్రతిపాదించారు. కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ వైపు నుంచి వచ్చే వాహనాలు అండర్‌పాస్ నుంచి మహారాజ అగ్రసేన్ చౌరస్తా వైపు వెళ్తాయి. అగ్రసేన్ చౌరస్తా వైపు నుంచి వచ్చే వాహనాలు అండర్‌పాస్ నుంచి జర్నలిస్ట్ కాలనీ చౌరస్తా వైపు వెళ్ళి ఉంటుంది. ఫిల్మ్‌నగర్ వైపు నుంచి వచ్చే వాహనదారులు వంతెన మీదుగా మహారాజ అగ్రసేన్ జంక్షన్ వైపు వెళ్లే అవకాశం కలుగుతుంది. ఇలా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు రకరకాల ప్రయత్నాలు సాగుతున్నాయి. అయితే వీటన్నిటి కన్నా ఒక ఎత్తయితే ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చేయడం మరో ఎత్తు కావాలి. టూ వీలర్స్, ఆటోలకు ప్రత్యేక లైన్లు ఉంటే తప్పు కార్లు, బస్సులు సాఫీగా ముందుకు వెళ్లలేవు.

# హైడ్రా ఆగితే.. హైదరాబాద్ మరో వయనాడ్

(మొదటి పేజీ తరువాయి)

హైడ్రా, మూసీ ప్రక్షాళన మీద కేటీఆర్, హరీష్ రావు, కిషన్ రెడ్డిలవి చిల్లర మాటలని ఫైర్ అయ్యారు. నిజామాద్ జిల్లాలో పర్యటించిన మహేష్ కుమార్ గౌడ్.. ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ కార్యకర్తలతో చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. గత పదేళ్ళలో యువతకు ఉద్యోగాలు ఇవ్వని బీఆరెస్‌కు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున ఉద్యోగలిచ్చామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద దుష్ప్రచారం చేయటానికి బీఆర్ఎస్, బీజేపీ ఒకటయ్యాయని.. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కాళేశ్వరం సహా బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై ఉక్కుపాదం మోపతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనను వివరిస్తూనే స్థానిక సంస్థలు ఎన్నికలకు వెళతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి బీఆర్ఎస్, బీజేపీ నేతలకు లేదని అన్నారు. నిలిచిపోయిన ఎల్ఆర్ఎస్, మాస్టర్ ప్లాన్ అంశాలపై అందరితో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. లోకల్ బాడి ఎన్నికలను సాధ్యమైనంత తొందరగా నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నామని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. రాష్ట్రంలో కుల గణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. రుణమాఫీ, రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం, స్థానిక సంస్థల్లో మెజార్టీ సీట్లు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 50 వేల వరకు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 10 ఏళ్లలో 30 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రుణమాఫీ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయన్నారు. పదేళ్లలో బీర్ఎస్ ఇచ్చిన రుణమాఫీ ఎంత, కాంగ్రెస్ 9 నెలల్లో ఇచ్చిన రుణ మాఫీ ఎంతో రైతులు గుర్తించాలని సూచించారు. సోషల్ మీడియాని సోషల్ సెన్స్ లేకుండా వాడుతున్నారని పీసీసీ చీఫ్ మండిపడ్డారు. పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఇది తాత్కాలిక ఆనందం ఇచ్చినా దీర్ఘకాలికంగా బి అర్ ఎస్ కు నష్టం చేకూరుస్తుందని హెచ్చరించారు. బీజేపీ, బీఆర్ఎస్ లు ప్రజలను మభ్యపెడుతున్నాయన్నారు. వీలైనంత త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని తెలిపారు. మంత్రి కొండా సురేఖ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి వివాదంపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. పరకాలలో కార్యకర్తల అత్యుత్సాహం వల్లే ఇద్దరి మధ్య వివాదం చెలరేగిందన్నారు. మంత్రి , ఎమ్మెల్యే ఇరువురి తో మాట్లాడినట్లు తెలిపారు. ఈ అంశంపై మాట్లాడాలని ఇన్‌ఛార్జి మంత్రికి చెప్పామన్నారు. మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రేవూరి వివాదం పార్టీ అంతర్గత సమస్య త్వరలో సమసిపోతుందని స్పష్టం చేశారు. మరోవైపు ఎమ్మెల్యే పోచారం, మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి పై మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. డీసీసీ అధ్యక్షునికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలకు నష్టం జరగకుండా సామరస్యంగా సమస్య పరిష్కరిస్తామన్నారు. ఆదివారం కొండా వర్గం రేవూరి వర్గం మధ్య ఫ్లెక్సీల వివాదం చెలరేగింది. దసరా బతుకమ్మ వేడుకల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే రేవూరి పేరు లేకపోవడంతో వివాదం మొదలైంది. ఎమ్మెల్యే పేరు పెట్టాలంటూ కొండ వర్గానికి రేవూరి అనుచరులు సూచించారు. రేవూరి ఫోటో లేకుండా ఫ్లెక్సీలు పెట్టడంతో ఫ్లెక్సీలను చించేశారు. ఫ్లెక్సీలు చించి వేసారంటూ రేవూరి అనుచరులపై కొండ వర్గం దాడికి పాల్పడ్డారు. దీంతో గాయాల పాలైన రేవూరి అనుచరులు కొండ వర్గంపై ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని కొండ అనుచరులను అరెస్ట్ చేశారు. ఆధారాలు లేకుండానే తమ కార్యకర్తలను అరెస్ట్ చేశారంటూ కొండ అనుచరులు పేర్కొన్నారు.. గీసుకొండా పోలీస్ స్టేషన్ పరిధిలో 16వ డివిజన్ నర్సంపేట రహదారిపై కొండా వర్గం ధర్నాకు దిగింది. పోలీసులు అదుపులోకి తీసుకున్న తమ వర్గానికి చెందిన కార్యకర్తలను విడుదల చేయాలంటూ ఆందోళన చేపట్టారు. ధర్నా చేస్తున్న కార్యకర్తలపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. సమస్య వివాదాస్పదం కాకుండా రంగంలోకి దిగిన పోలీసులు ఇరు వర్గాలకు నచ్చచెప్పి ట్రాఫిక్ ని క్లియర్ చేశారు. ఈ ధర్నాతో మరోసారి కొండ, రేవూరి ఆధిపత్య పోరు మరోసారి బట్టబయలైంది.

## మోండా మార్కెట్‌లో ముత్యాలమ్మ
# విగ్రహం ధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

దోషులను వెంటనే పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని ప్రభుత్వం కఠినంగా ఉండాలని చెబుతున్నారు. సికింద్రాబాద్ మోండా మార్కెట్ సమీపంలోని కుమ్మరిగూడలో ముత్యాలమ్మ ఆలయం అమ్మవారి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయం తెలియడంతో ఆలయం వద్దకు పెద్ద సంఖ్యలో స్థానికులు చేరుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు భారీగా మోహరించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆలయం వద్దకు చేరుకున్నారు. సీపీ సీవీ ఆనంద్‌తో కలిసి గుడి లోపలికి వెళ్లి పరిశీలించారు. పోలీసు ఉన్నతాధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మరోవైపు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణెశిశ్ ఘటనాస్థలికి చేరుకుని స్థానికులతో మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఇప్పటికే ఒకర్ని అరెస్టు చేశారు. సికింద్రాబాద్‌లో ఈ మధ్య కాలంలో ఆలయాల్లో విగ్రహాలు తరచూ దుండగులు ధ్వంసం చేస్తున్నారు. ఇలాంటి కేసులు ఈ మధ్య కాలంలోన రెండు నమోదు అయ్యాయి. రెండు రోజుల క్రితం ఓ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు విరగొట్టారు. ఆదివారం రాత్రి మరో విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఈ విగ్రహం ధ్వంసం కేసులో ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. ఆ ప్రాంతంలో అనుమాస్పదం గా తిరుగుతున్న వ్యక్తికి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. మరికొందుర పరారైనట్టు స్థానికులు చెబుతున్నారు స్థానికులు చెప్పిన ఆనవాళ్ల ప్రకారం పరారైన వ్యక్తుల కోసం గాలిస్తున్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్‌ను కూడా పరిశీలిస్తున్నారు. విగ్రహం ధ్వంసమైన ఘటనపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సీరియస్ అయ్యారు. గుడిలోపలికి వెళ్లి వివరాలపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని దేవాలయాల్లో సీసీ కెమెరాలు పెట్టాలని అన్నారు.

# సాయిబాబాకు ఘనంగా నివాళి

### గన్‌పార్క్ వద్ద నివాళి అర్పించిన ప్రముఖులు
### అనంతరం గాంధీ ఆస్పత్రికి బాడీ అప్పగింత

**హైదరాబాద్,అక్టోబర్14(నమస్తే ఉదయం):** గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద ప్రొఫెసర్ సాయిబాబా పార్థివదేహానికి పలువురు నివాళులర్పించారు. అనంతరం ఇంటికి తరలించగా పలువురు నివాళి అర్పించారు. తదుపరి పార్థివదేహాన్ని గాంధీ ఆస్పత్రికి అప్పగించారు. అంతకుముందు గన్ పార్క్ వద్దసీపీఐ నేత నారాయణతో పాటు పలువురు వామపక్ష నేతలు అంజలి ఘటించారు.





సాయిబాబా అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి తరలి వచ్చారు. కామ్రేడ్ సాయిబాబా అమర్‌రహే, లాల్ సలాం, ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. గన్‌పార్కు వద్ద 5 నిమిషాల సంతాప సమావేశం ఏర్పాటు చేస్తామని కుటుంబసభ్యులు, అభిమానులు కోరగా.. పోలీసులు నిరాకరించారు. సాయిబాబా పార్థివదేహాన్ని అంబులెన్స్‌లోనే ఉంచి నిర్వహిస్తామని చెప్పినా అనుమతి ఇవ్వలేదు. దీంతో సాయిబాబా అభిమానులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతం సాయిబాబా భౌతికకాయాన్ని మౌలాలిలోని ఆయన నివాసానికి తరలించారు. పుస్తకాలు కాకుండా సమాజాన్ని చదివేవారు మేధావులని సీపీఐ నేత నారాయణ అన్నారు. సాయిబాబా అలాంటి వ్యక్తి అని కొనియాడారు. గన్‌పార్కు వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. సాయిబాబాను పదేళ్లు అన్యాయంగా జైల్లో నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. దోషి ఎవరో తేల్చాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తికి లేఖ రాస్తామని నారాయణ చెప్పారు. సాయిబాబా భౌతిక కాయానికి మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కోదండరామ్ నివాళి అర్పించారు. జైలు నుంచి వచ్చిన కొన్నాళ్లకే సాయిబాబా మరణించడం బాధాకరమని హరీశ్‌రావు అన్నారు. సమాజంలో మార్పు, హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. హక్కుల కోసం పోరాడేవారిపై అక్రమ కేసులు పెట్టడం బాధాకరమన్నారు. సాయిబాబాపై కేంద్రం అణచివేత ధోరణితో వ్యవహరించిందని కోదండరామ్ తెలిపారు. ఆయన మృతికి కేంద్రం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ మౌలిక సూత్రాల అమలు కోసం సాయిబాబా పోరాడారని తెలిపారు. ప్రజాస్వామ్యవాదులంతా ఆయన నిర్బంధాన్ని ఖండించారని కోదండరామ్ గుర్తుచేశారు.

# క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్‌లు

### తెలంగాణలోనే కొనసాగించాలని రిక్వెస్ట్

**హైదరాబాద్,అక్టోబర్14(నమస్తే ఉదయం):** తెలంగాణ కేడర్‌కు చెందిన పలువురు ఐఏఎస్ అధికారులను డీవోపీటీ ఏపీకి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఏపీలో రిపోర్ట్ చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నలుగురు ఐఏఎస్ అధికారులు సోమవారం కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి, సృజన వేర్వురుగా క్యాట్‌లో పిటిషన్లు దాఖలు చేశారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయాలని ఐఏఎస్ అధికారులు కోరారు. తెలంగాణలోనే కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అధికారుల పిటిషన్లపై క్యాట్ మంగళవారం విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఏపీ విభజన నేపథ్యంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు కేంద్రం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కేంద్రం సర్దుబాటు చేసింది. ఈ సమయంలో ఐఏఎస్ అధికారులను ఏపీ, తెలంగాణ కేడర్‌లకు కేటాయించింది. అయితే, ఇందులో కొందరు అధికారులు తమను ఏపీ కేడర్‌కు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ కేడర్‌గా గుర్తించాలని కోరుతూ పలు కారణాలను చూపించారు. అయితే, ఈ విషయంలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ క్యాట్‌ను ఆశ్రయించగా.. అధికారుల అభ్యర్థనను క్యాట్ పరిగణలోకి తీసుకున్నది. అయితే, ఈ తీర్పును డీఓపీటీ తెలంగాణ హైకోర్టు సవాల్ చేసింది. 2023 మార్చిలో పిటిషన్‌పై విచారించింది. అధికారుల అభ్యర్థనను పరిశీలించాలని కేంద్రాన్ని ఆదేశించింది. దీంతో దీపక్ ఖండేకర్ ఏకసభ్య కమిషన్‌ను కేంద్రం ఈ ఏడాది మార్చి 21న ఏర్పాటు చేసింది. కమిటీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల అభ్యర్థనలను పరిశీలించింది. వ్యక్తిగతంగానూ విచారించి.. అభ్యర్థలను తిరస్కరించింది. ఈ క్రమంలో డీఓపీటీ ఏపీ కేడర్‌కు కేటాయించిన ఆలిండియా సర్వీస్ అధికారులను ఏపీ కేడర్‌కు వెళ్లాల్సిందిగా ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 16లోగా ఏపీలో రిపోర్ట్ చేయాలని డీఓపీటీ స్పష్టం చేసింది. అయితే, డీఓపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ నలుగురు అధికారులు క్యాట్‌ని ఆశ్రయించారు.

# ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

ఎంత ముఖ్యమైందన్న విషయాన్ని ఈ ముగ్గురూ తమ పరిశోధనల్లో వెల్లడించారు. బ్యాంకులు దివాళా తీయకుండా ఉండేందుకు ఈ స్టడీ చాలా కీలకమైందని నోబెల్ కమిటీ అభిప్రాయపడింది. కాగా, స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఏటా ఈ అవార్డును ప్రదానం చేస్తోన్న విషయం తెలిసిందే. 1896లో ఆల్‌ఫ్రెడ్ నెబెల్ మరణించగా.. 1901 నుంచి ఆయన జ్ఞపకార్థం ఆయన ట్రస్ట్ ద్వారా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే వైద్య, భౌతిక, రసాయన శాస్త్రాల్లో, సాహిత్యంలో నోబెల్ గ్రహీతల పేర్లను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇవాళ అర్థశాస్త్రంలో నోబెల్ బహుమతిని ప్రకటించారు. ఈ అవార్డు గ్రహీతలకు 11 లక్షల స్వీడిష్ క్రోనర్ (10 లక్షల డాలర్లు) నగదు అందుతుంది.

# గంగానదికి ఒక న్యాయం...
# మూసీకి ఒక న్యాయామా?

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడితే మూసీ పరిరక్షణ అని చెబుతున్న ముఖ్యమంత్రి.. మూసీనే ప్రమాదంలో పెట్టే ఈ ప్రాజెక్ట్‌కు ఎందుకు అంగీకారం తెలిపారో చెప్పాల న్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్ల సమయంలో ఎంత ఒత్తిడి తెచ్చినప్పటికీ తమ ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ కు అంగీకారం తెలపలేదని కేటీఆర్ గుర్తు చేశారు.

దేశంలోనే అటవీ సామర్థ్యాన్ని పెంచేందుకు హరిత హారం చేపట్టి అటవీ విస్తీర్ణాన్ని బీఆర్ఎస్ సర్కార్ పెంచిందన్నారు. అలాంటిది రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే దాదాపు 2900 ఎకరాల అటవీ భూభాగాన్ని నాశనం చేసేలా చర్యలు చేపట్టటమేమిటనీ కేటీఆర్ ప్రశ్నించారు.

గంగానది జన్మస్థానం గంగోత్రి వద్ద 150 కిలోమీటర్ల పరిధిని, కేంద్రం ఎకో సెన్సిటివ్ జోన్ గా ప్రకటించిన విషయాన్నికేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గంగోత్రికి ఒక న్యాయం...మా మూసీ నదికి మరో న్యాయమా అంటూ నిలదీశారు. దామగుండం లో ఏర్పాటు చేస్తున్న రాడార్ కేంద్రం వికారాబాద్ అడవుల్లోనే మూసీ జన్మస్థానం లోనే ఉందన్నారు. నది పుట్టిన ప్రాంతాన్ని "ఎకో సెన్సిటివ్ జోన్"గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నేవీ రాడార్ ఏర్పాటుతో మూసీ నది అంతర్థానం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. "సోర్స్ అఫ్ ద రివర్"పై ఇది గొడ్డలి పెట్టని చెప్పారు. మూసీ నది పురుడు పోసుకున్న చోట... 12 లక్షల చెట్ల నరికి వేతతో కోలుకోలేని అనర్థం జరుగుతుంద న్నారు. పర్యావరణ సమతుల్యతకు పెను ప్రమాదాన్ని సృష్టించే ఈ ప్రాజెక్ట్ ను విరమించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

మూసీ నదిని ఫణంగా పెట్టేందుకు సహకరిస్తూ మరో వైపు మూసీ పరిరక్షణ అంటూ ముఖ్యమంత్రి డ్రామాలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మూసీ పరిరక్షణపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాడార్ నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లో అంగీకారం తెలిపేది కాదన్నారు. మూసీ పేరుతో వేలకోట్ల దోపిడీ చేయా లన్న ఆలోచనే తప్ప నిజంగా నది పరిరక్షణ పై ఈ ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు. దేశ రక్షణ విషయంలో తెలంగాణ ముందుం టుంది. కానీ జనా వాసాల లేని చోట్ల ఏర్పాటు చేయాల్సిన రాడార్ కేంద్రాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసి నష్టం చేస్తా మంటే అంగీకరించమని చెప్పారు. రాడార్ కేంద్రానికి వ్యతిరేకంగా పర్యావరణ వేత్తలతో కలిసి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ పాలన

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో ప్రజల వ్యతిరేకతను కాంగ్రెస్ ప్రభుత్వం కూడగట్టుకుందని తెలిపారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ అప్పుల పాలు చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం మూసి సుందరీకరణ పేరుతో రూ.లక్ష 80 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి ఇంతవరకు డీపీఆర్ తయారు చేయలేదన్నారు. కాంగ్రెస్‌పై వ్యతిరేకతతోనే హర్యానా రాష్ట్రంలో బీజేపీకి ప్రజలు పట్టం కట్టారన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ సహకరించకుండా ముందుకు పోనున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో బీజేపీకి గణనీయంగా ఓట్ల శాతం పెరిగిందని పార్టీని కొనియాడారు. ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీకి అధిక ఓట్లు రావడం విశేషమన్నారు. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మోదీ ప్రధాని అయ్యాక ఆలయాల రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. భద్రాచలం, రామప్ప, జోగులాంబ, బల్కంపేట ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. వెయ్యి స్తంభాల మండపంలో పూజా కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. దేశ వ్యాప్తంగా 150 దేవాలయాలకు పూర్వవైభవం తీసుకొస్తున్నాం. ఇప్పుడు యువత కూడా పెద్ద సంఖ్యలో ఆలయాలకు వస్తున్నారు. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం పెరుగుతోంది. పెద్దలపై గౌరవం, దేశభక్తి, సమాజంపై బాధ్యత పెంచుకోవాలి. మరింత అంకితభావం, చిత్తశుద్ధితో దేశాభివృద్ధికి కృషి చేస్తాం. మోదీ ప్రభుత్వ హయాంలోనే రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో భద్రకాళి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## వైవిధ్య వాతావరణం
# ప్రజలు ఉక్కిరిబిక్కిరి

(మొదటి పేజీ తరువాయి)

అడపాదడపా వర్షం కురుస్తుంది. ఆ వెంటనే చలి తీవ్రత ఉంటుంది. ఇక రాత్రి ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా విరుద్ధమైన వాతావరణంతో ప్రజలు సతమతమవుతున్నారు. ఇలాంటి వాతావరణం గతంలో ఎన్నడూ చూడలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఉదయం 7 నుంచే సూర్యుడు తన ప్రతాపం చూపుతున్నాడు. సాయంత్రం 5 వరకు ఎండ తీవ్రత ఉంటున్నది. ఎండ తీవ్రతతోపాటు ఉకపోత అధికంగా ఉంటుంది. ఈ వేడికి వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా.. ఇలాంటి వాతావరణం గత వారం రోజులుగా ఉంటున్నది. 20 నిమిషాలు బయట తిరిగితేనే.. త్వరగా డీహైడ్రేషన్‌కు గురై.. తొందరగా అలిసిపోతున్నారు. పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లో ఈ పరిస్థితులు అధికంగా ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో గరిష్ఠ పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి.ఈ వేడి కారణంగా తాము పని చేసుకోలేకపోతున్నట్టు రైతులు వాపోతున్నారు. పంటలు చేతికొచ్చే సమయం కావడంతో ఇబ్బంది పడుతున్నారు. రాత్రంతా ఫ్యాన్లు, ఏసీలు తిరుగుతున్నా ఉకపోత నుంచి ఉపశమనం లభించడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్లోబల్‌వార్మింగ్‌కు తోడు క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఈ వైవిధ్యమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు అంటున్నారు. దీనికితోడు కరెంట్ కోతలు పెరిగాయి. గతంతో పోలిస్తే కరెంట్ కట్స్ నిత్యం కనిపిస్తున్నాయి. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా మాత్రం సాగడం లేదు. ఎసిలు, ఫ్యాన్లు లేకుండా గడపలేని పరిస్థితి వచ్చింది. కరెంట్ ఛార్జీలు కూడా పెరుగుతున్నాయి. విద్యుత్ వినియోగం కూడా పెరిగిందని అధికారులు కూడా అంచావేస్తున్నారు.


# గుర్రంపోడు ఎస్ఐ
# నారాయణరెడ్డిపై సస్పెన్షన్ వేటు

**నల్లగొండ,అక్టోబర్14(నమస్తే ఉదయం):** గుర్రంపోడు ఎస్ఐ వి. నారాయణరెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. వివాహిత హత్య కేసు విచారణలో నిర్లక్ష్యంగా వహించడంతో పాటు నిందితులను తప్పించేందుకు లంచం తీసుకున్నట్లు నిర్ధారణ కావడంతో ఐజి సత్యనారాయణ ఈ చర్యలు తీసుకున్నారు. గుర్రంపోడు మండలం ముల్కలపల్లిలో ఇటీవల ఓ వివాహిత హత్య జరిగింది. ఈ కేసు విచారణలో ఎస్ఐ నారాయణరెడ్డి నిర్లక్ష్యంగా వహించారనే ఆరోణపణలు ఉన్నాయి. అంతేకాదు, హత్య కేసులో ఎ2, ఎ3 నిందితులను తప్పించేందుకు కానిస్టేబుల్ ద్వారా లక్ష రూపాయలు లంచం తీసుకున్నట్లు బయటకొచ్చింది. ఇది విచారణలో నిజమని తేలడంతో ఐజి సత్యనారాయణ అతన్ని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇదే కేసులో కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ్ గౌడ్‌తో పాటు మరో కానిస్టేబుల్‌పై విచారణ కొనసాగుతోంది.

# నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన వ్యక్తి ప్రేమయ్య

**కొత్తకోటలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం**

**బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**



ప్రేమయ్య చిత్రపటానికి పుష్పాంజలు ఘటి స్తున్న నాయకులు

**కొత్తకోట,జఅక్టోబర్ 14(నమస్తే ఉదయం):** నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన వ్యక్తి ఎస్ఆర్ ప్రేమయ్య అని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ అన్నారు. ఇటీవలే అకాల మరణం చెందిన ప్రేమయ్య సంస్మరణ సభ కొత్తకోటలోని ప్రేమయ్య నివాసంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాచాల ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ధ్యానరత్న అవార్డు గ్రహీత ప్రేమయ్య మృతి బాధాకరమని, కడ్తాల్ మహేశ్వరం మహా పిరమిడ్ ట్రస్ట్ జీవితకాల సభ్యుడిగా ఉన్న ప్రేమయ్య గతంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి శ్రమశక్తి,అవార్డును కూడా పొందాడని గుర్తు చేశారు. అయన బ్రతికినంత కాలం స్వేచ్ఛ,సమానత్వం కోసం పోరాటం చేశారని, చివరి శ్వాస వరకు ప్రజల మధ్య ఉంటూ, ప్రజాసేవకుడిగా గుర్తింపు పొందిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయనకు రాజ కీయంగా ఎన్నో పదవులు అనుభవించే అవకాశం వచ్చినప్పటికీ వాటిని సున్నితంగా తిరస్కరించారని, ఎల్లప్పుడూ పేద వర్గాల అభ్యున్నతి కోసమే పరితపించేవారన్నారు. మేము కూడా అయన నుంచి స్పూర్తి పొందిన వాళ్ళమే అని, ఆయన ఆశయ సాధన కోసం పనిచేస్తామని అన్నారు.

పేద వర్గాల అభ్యున్నతికై నిరంతరం కృషి చేసిన ప్రేమయ్య విగ్రహాన్ని అందరి సహకారంతో కొత్తకోటలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రేమయ్య కుటుంబ సభ్యులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయేజ్, మిషేక్, ప్రసాద్, మహేందర్ నాయుడు, బిఆర్ఎస్ నాయకులు సత్యం యాదవ్, ఉపాధ్యాయ సంఘం నేత భక్తరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల విద్యుత్ సబ్ డివిజన్ ఏడిఈగా రాజేష్

**డిఈగా పదోన్నతి పొందిన ప్రస్తుత చేవెళ్ల ఏ డి ఈ స్వామి**

**ఏడిఈగా పదోన్నతి పొందిన చిల్కూర్ అసిస్టెంట్ ఇంజనీర్ రాజేష్**

**చేవెళ్ల, అక్టోబర్ 14(నమస్తే ఉదయం):** చేవెళ్ల విద్యుత్ సబ్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ గా రాజేష్ బాబు నియమితులయ్యారు. సోమవారం చేవెళ్ల ఏ డి ఈ గా పనిచేస్తూ డి ఈ గా పదోన్నతి పొందిన స్వామి నుండి రాజేష్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరుగా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పదోన్నతి పొంది బదిలీ అయిన స్వామి మాట్లాడుతూ.. స్థానిక నాయకులు, ప్రజలు, విద్యుత్‌శాఖ అధికారులు సిబ్బంది సహకారంతో విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేశామన్నారు.



విద్యుత్ డిఈగా పదోన్నతి పొందిన స్వామి నుండి ఏడిఈగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజేష్

# డీఎస్సీలో టాపర్‌గా నిలిచిన లక్ష్మిని అభినందించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**కొత్తకోట, అక్టోబర్ 14(నమస్తే ఉదయం):** ఎమ్మార్వో ఆఫీస్ పరిసరాలలో 50 పడకల ఆసుపత్రి కోసం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కానయపల్లి గ్రామంలో డీఎస్సీలో వనపర్తి జిల్లా టాపర్ గా నిలిచి టీచర్ జాబ్ పొందిన లక్ష్మీకి శుభాకాంక్షలు ఎమ్మెల్యే జియంఆర్ తెలియజేశారు.



కానాయపల్లికి చెందిన లక్ష్మీ డీఎస్సీలో టీచర్ జాబ్ సాధించిన సందర్భంగా సన్మానించినఎమ్మెల్యే జిఎంఆర్

# గగన్ పహాడ్‌లో సమస్యలు పరిష్కరించండి

**బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ వినయ్ రెడ్డి**

**రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు**



డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌కు గగన్ పహాడ్ సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు వినయ్ రెడ్డి

**రాజేంద్ర నగర్, అక్టోబర్ 14(నమస్తే ఉదయం):** గగనపహాడ్ లో ప్రజలు రోడ్లు, డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించేందుకు అభివృద్ధి పనులు చేపట్టాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కే రవికుమార్ ను కలిసి బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ సు రెడ్డి వినయ్ కుమార్ రెడ్డి పార్టీ నాయకులు మాగాని శివకుమార్, సామా రాహుల్ రెడ్డి తో కలిసి వినతి పత్రం అందజేశారు. సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఎందుకు పట్టించుకోవటం లేదని వినయ్ కుమార్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు. బస్తీలో గుంతల మయంగా మారిన రోడ్లు, డ్రైనేజ్ పైప్ లైన్ పగిలి రోడ్లపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని అయినా అధికారులు పట్టించు కోవటం లేదని వినయ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను ప్రజలు నాలుగు సార్లు గెలిపించిన చిన్న సమస్యలు కూడా పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. రోడ్లపై డ్రైనేజీ పొంగి పళ్ళు తినడం వల్ల దుర్వాసన దోమల బెడద తో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని, రోడ్లు గుంతల మయంగా మారడం వల్ల ప్రమాదాల వారిని పడుతున్నారని ఆయన డిప్యూటీ కమిషనర్ కు అందుకు డిప్యూటీ కమిషనర్ రవికుమార్ సానుకూలంగా స్పందించి క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తారన్నారు.



# వైభవంగా వెంకటగిరి స్వామి కళ్యాణం

**కొత్తకోట, అక్టోబర్ 14(నమస్తే ఉదయం):** కొత్తకోట పట్టణ సమీపంలో వెంకటగిరి క్షేత్రం లో వెలిసిన శ్రీ భూలక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణం వైభోగంగా నిర్వహించారు. పూజలు అనంతరం అమ్మవారికి మంత్రోచ్చరణల మధ్య మేళ తాళాలతో స్వామివారి కళ్యాణం శనివారం విజయదశమి పండుగ రోజున అంగరంగ వైభవంగా నిర్వహించారు. శోభయమానంగా అలంకరించి కళ్యాణ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణోత్సవంలో జిలకర బెల్లం తదితర పూజలు అనంతరం అమ్మవారికి మంగళ సూత్రధారణ జరిపించారు. స్వామి వారి జన్మ నక్షత్రం శ్రావణ నక్షత్రం రోజున వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయం అర్చకులు పట్టు వస్త్రాలతో అలంకరణ చేసి కళ్యాణ మండపంలో అర్చకుల పేద మంత్రాలతో కళ్యాణం వైభవంగా నిర్వహించారు. సింగరా ఆచార్యులు, కిట్టు స్వామి, అమిత్ స్వాములు స్వామివారి కళ్యాణాన్ని నిర్వహించారు. ఆలయ గర్భగుడి నుండి ఉత్సవ మూర్తి విగ్రహాలని కళ్యాణ మండపం వద్దకు తీసుకువచ్చి కళ్యాణం నిర్వహించిన తర్వాత పల్లకిలో కూర్చోబెట్టి పూజలు చేసి వెంకటేశ్వర స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి భక్తులు పల్లకి సేవతో గోవింద నామస్మరణల మధ్య భుజాలపై పల్లకిని మోస్తూ ఆలయం చుట్టూ భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యక్షణాలు చేస్తూ పల్లకి సేవలు వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుండి భక్తులు పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కళ్యాణ కార్యక్రమంలో గొల్ల బాబు, వేముల శ్రీనివాస్ రెడ్డి,నరోత్తం రెడ్డి, బలిజేపల్లి శ్రీనివాసులు శెట్టి, కురుమూర్తి సాగర్, గంగు బాల్ రెడ్డి, పాలెం రాంబాబు రెడ్డి, సతీష్ కుమార్, సంబరి భాస్కర్, వెంకట్ రెడ్డి, శివ శంకర్ తదితరుల కుటుంబాలు కళ్యాణంలో పాల్గొన్నారు.

# విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

**ఎస్‌జిఎఫ్ అండర్ 14 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14(నమస్తే ఉదయం):** గద్వాల జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నందు 68 వ ఎస్ ఎఫ్ జి అండర్ 14 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను సోమవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు.

ఈసందర్భంగాఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ...విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో కూడా నైపుణ్యం పొంది ఉండాలన్నారు. క్రీడల వల్ల మనకు మానసికంగా శారీరకంగా దృఢత్వాన్ని పెంచుతుందన్నారు. ప్రతి ఒక్కరు క్రీడలలో మంచి నైపుణ్యతను సాధించి, రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురవ హనుమంతు, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి జి. వేణుగోపాల్, కౌన్సిలర్ మురళి సింగిల్ విండో డైరెక్టర్ రఘు కుమార్ శెట్టి, నాయకులు గోవిందు, సతీష్, రిజ్వాన్, ఉరుకుందు, కురుమన్న, లక్ష్మన్న, ధర్మ నాయుడు, కిరణ్, రాజు, పూడూరు చిన్నయ్య, క్రీడాకారులు క్రీడా కారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు .



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి



ప్రజావాణిలో ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్ సంతోష్

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14(నమస్తే ఉదయం):** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 20 ఫిర్యాదులను స్వీకరించడం జరిగిందన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు సమర్పించిన దరఖాస్తులను అదనపు కలెక్టర్లు నర్సింగ్ రావు, లక్ష్మీనారాయణతో కలసి కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# ప్రజావాణిలో రైతు ఆత్మహత్యయత్నం...

## హైదరాబాద్ ప్రజా భవన్‌లో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కరించలేదు

## నా భూమి నా పేరున మార్పించండి - బాధిత రైతు పరశురాముడు ఆవేదన

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14(నమస్తే ఉదయం):** ప్రజావాణి కార్యక్రమంలో పురుగుల మందు తాగి ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చోటు చేసుకుంది. అయిజ మండలం గుడుదొడ్డి గ్రామానికి చెందిన పరుశరాముడుకి యాపలదిన్నె గ్రామ శివారులో తన పొలం ఇతరులపై అయిజ ఎమ్మార్వో రిజిస్టర్ చేశాడని ఆరోపిస్తు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశాడు. తన భూమి తనకు రిజిస్టర్ చేయాలని వేడుకున్న ఫలితం లేకపోయింది.

దీంతో జిల్లా కలెక్టర్ ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన పోలీసులు రైతుని గద్వాల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ప్రజావాణిలో ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని, గత జూలై నెలలో కూడా ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ముందు పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించాడు. తనకు జరిగిన అన్యాయంపై ఐజ మండలం గుడు దొడ్డి గ్రామం నుంచి కుటుంబ సభ్యులు అంతా కలిసి కాలినడకన హైదరాబాద్ ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమానికి వెళ్లి అక్కడ కూడా వినతి పత్రం సమర్పించినట్లు బాధితుడు తెలిపారు. అయిన అధికారుల నుంచి ఎలాంటి సమాధానం లేకపోవడంతో విసుగు చెంది పురుగుల మందు తాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

తమకు న్యాయం చేసి తమ పొలాన్ని తమకు ఇప్పించాలని కుటుంబ సభ్యులు విలపిస్తూ వేడుకుంటున్నారు.



కార్తీక్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మార్కండేయ నగర్ నాయకులు.

## కార్తీక్ రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నాయకులు

**రాజేంద్రనగర్, అక్టోబర్ 14 (నమస్తే ఉదయం):** విజయదశమిని పురస్కరించుకొని మైలార్ దేవ్‌పల్లి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ కార్తీక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో రాఘవేందర్ యాదవ్, యాదగిరి భాస్కర్, అంజి ధనుంజయ, గుత్తి మల్లేష్ లు ఉన్నారు.



మృతి చెందిన రైతు కుటుంబ సభ్యులకు భీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

## రైతు బీమా 5లక్షల రూపాయలు చెక్కు అందజేసిన ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14(నమస్తే ఉదయం):** అనారోగ్యంతో మృతి చెందిన రైతు కుటుంబ సభ్యులకు గద్వాల శాసనసభ్యులు కృష్ణమోహన్ రెడ్డి భీమా చెక్కును అందజేశారు. సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కె.టి దొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు వడ్డే వెంకటేష్ అనారోగ్యంతో మరణించారు . మృతి చెందిన వెంకటేష్ రైతు భార్య వి. శశికళ కు ప్రభుత్వం తరుపున ఐదు లక్షల బీమా చెక్కును గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అందజేశారు.

ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని రైతు వెంకటేష్ కుటుంబ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురవ హనుమంతు, నాయకులు చక్రధర్ రావు, జి.వేణుగోపాల్ , ఉరుకుందు, రాఘవేంద్ర రెడ్డి, గోపి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ధృవీకరణ పత్రం అందజేస్తున్న విశ్వవిద్యాలయం రిజిస్టర్ డాక్టర్ రఘురాంరెడ్డి



## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన యూజీ వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన కోర్సుల కౌన్సిలింగ్

### రాజేంద్రనగర్ వెటర్నరీ కళాశాలలో తొలి అడ్మిషన్ పొందిన ఎం స్ఫూర్తి

**రాజేంద్రనగర్, అక్టోబర్ 14(నమస్తే ఉదయం):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన యూజీ (అండర్ గ్రాడ్యుయేట్) కోర్సులలో ప్రవేశాలకు కౌన్సిలింగ్ సోమవారం ప్రారంభమైంది. రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహిస్తున్న ఈ కౌన్సిలింగ్ ను రిజిస్ట్రార్ డాక్టర్ పి రఘురామిరెడ్డి ప్రారంభించారు. తెలంగాణ ఎప్సెట్ - 2024 లో 369 ర్యాంకు పొందిన ఎం.స్ఫూర్తి రాజేంద్రనగర్ వెటర్నరీ కళాశాలలో తొలి అడ్మిషన్ పొందింది. అలాగే, 431, 550 ర్యాంకు పొందిన వై.శేషపద్మిని ఎస్.ధరణి కుమార్ కూడా రాజేంద్ర నగర్ వెటర్నరీ కళాశాలలో బీవీఎస్సీ కోర్సులో సీటు పొందారు. అయితే, 732 వ ర్యాంకు వచ్చిన మహమ్మద్ సోహెల్ వరంగల్ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో సీట్ తీసుకున్నాడు. వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన కోర్సులలో చేరడం వల్ల విద్యార్థులకు ఉన్న ఉపాధి ఉన్నత విద్యా అవకాశాల గురించి ఆయా విశ్వ విద్యాలయాల అధికారులు ఈ సందర్భంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో వెటర్నరీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ గోపాల్ రెడ్డి, వ్యవసాయ విశ్వ విద్యాలయం డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జయశ్రీ, డీన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ విజయలక్ష్మి, ఉద్యాన విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆధ్వర్యంలో ఈ తొలి విడత కౌన్సిలింగ్ ప్రారంభమైంది.

మొదటి పశు వైద్య కోర్స్ ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న విద్యార్థిని స్ఫూర్తి



## చోరీ కేసులో నిందితుడు రిమాండ్

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 14(నమస్తే ఉదయం):** గద్వాల మండలం పూడూరు గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసి సోమవారం రిమాండుకు తరలించినట్లు గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... గద్వాల మండలం పూడూరు గ్రామానికి చెందిన బోయ బీచుపల్లికి అనే వ్యక్తియొక్క తులం బంగారం ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకపోవడంతో బాధితుడు గద్వాల రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేసి బోయ రాఘవేందర్ ను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం నిందితుడిని గద్వాల కోర్టులో హాజరుపరచగా... న్యాయమూర్తి ఆదేశాల మేరకు బోయ రాఘవేందర్ ను 14 రోజులు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడి నుంచి తులం బంగారంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# సినీ పరిశ్రమను ప్రభుత్వం గౌరవిస్తుంది

- ఈ పరిశ్రమ ప్రపంచ స్థాయికి ఎదగాలి
- తెలంగాణ భావోద్వేగాలను తన ఆట, పాట ద్వారా ప్రపంచానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి గద్దర్
- తెలంగాణ మొత్తానికి ప్రతిరూపం గద్దర్
- గద్దర్ అవార్డుల కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్, అక్టోబర్ 14(నమస్తే ఉదయం):** తెలంగాణ సినీ పరిశ్రమను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున గౌరవిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన గద్దర్ సినీ అవార్డుల కమిటీ మొదటి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సినీ పరిశ్రమ దేశంలోనే కాదు ప్రపంచములోనే శాసించే స్థాయికి ఎదగాలని అన్నారు.

సినీ పరిశ్రమకు ఏ సమస్యలు ఉన్నా వినడానికి, పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి మీ అందరితో చెప్పాలని కోరినట్టు వివరించారు. సినీ పరిశ్రమల అవార్డుల విషయానికొస్తే నంది అవార్డులు ఒక పండుగల నిర్వహించేవారు. రాష్ట్ర విభజన తర్వాత ఎందుకో గత ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోలేదు అన్నారు.

తెలంగాణ అంటేనే సాంస్కృతిక జీవనం. తెలంగాణ అంటేనే ఆట, పాట.. ఇక్కడ బాధ వచ్చిన సంతోషం వచ్చినా పాట ద్వారానే వ్యక్త పరుస్తాము అని వివరించారు. తెలంగాణ సంస్కృతి చాలా గొప్పది... అందర్నీ అక్కున చేర్చుకొని, ప్రేమించే సంస్కృతి మన రాష్ట్రంలో ఉంటుంది అన్నారు. అసమానతలు, వైరుధ్యాల నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నారు అని వివరించారు.

పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా అంటూ సమాజాన్ని తెలంగాణ రాష్ట్ర సాధనకు సమాయత్తం చేసి నడిపించిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని డిప్యూటీ సీఎం అన్నారు. గద్దర్ ఒక లెజెండ్, ఒక శతాబ్ద కాలంలో ఆయన లాంటి వ్యక్తి పుడతారని నేను అనుకోవడం లేదని, ప్రపం చంలోని అన్ని సమస్యలపై ఆయన ప్రజలను పాటలతో కదిలించాలని తెలిపారు.

తెలంగాణ ఆట, పాటను ప్రపంచానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని అన్నారు. తెలంగాణలో ఏ గ్రామంలో చూసిన గద్దర్ లాగే పాడాలని ప్రయత్నిస్తుంటారు, ఆయనను అనుకరిస్తుంటారు తెలంగాణ మొత్తానికి గద్దర్ ప్రతిరూపమని తెలిపారు. అడవి, సినిమా, మానవులు, రాజ్యాంగం



అన్నిట్లో గద్దర్ తనదైన ముద్ర వేశారని అన్నారు. గద్దర్ మొదట విప్లవోద్యమ బాటలో అడవి బాట పట్టిన కాలక్రమమైన దేశంలోని అన్ని సమస్యలకు భారత రాజ్యాంగమే పరిష్కా రమని భావించి దాన్ని ఆయన విస్తృతంగా ప్రచారం చేశారని వివరించారు.

అన్ని అంశాలు పరిశీలించే రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ పేరిట సినిమా అవార్డులు ఇవ్వాలని నిర్ణయించిందని కమిటీ సభ్యులకు వివరించారు.

అన్ని అవార్డుల తరహాలోనే అన్ని రంగాలకు గద్దర్ అవార్డులు ఇచ్చుకోవచ్చని తెలిపారు. సినీ పరిశ్రమలోని అందర్నీ గౌరవించుకోవాలి, ప్రతి అవార్డు గొప్పగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతుందని తెలిపారు.

గద్దర్ అవార్డుల కార్యక్రమం గొప్ప పండుగలా జరగాలి, ఏ తేదీన జరపాలనేది కమిటీ నిర్ణయం తీసుకోవాలని కోరారు. గద్దర్ ను అత్యంత ప్రీతిపాత్రమైన వ్యక్తిగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. కొద్దిరోజుల్లోనే కమిటీ మరో మారు సమావేశమై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం కమిటీ సభ్యులను కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కాన్సెప్ట్ అద్భుతమైనదని ప్రముఖ సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్ సమావేశంలో డిప్యూటీ సీఎంకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్కిల్ యూనివర్సిటీలో యాక్టింగ్ స్కిల్స్ నేర్పించేందుకు ప్రత్యేక కోర్స్ ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

అన్ని అంశాలు పరిశీలించి ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్కిల్ యూనివర్సిటీలో యాక్టింగ్, కల్చర్‌కు సంబంధించిన అంశాలకు చోటు కల్పించడంపై నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, కమిటీ సభ్యులు నర్సింగరావు, తనికెళ్ల భరణి, సురేష్ బాబు, తమ్మారెడ్డి భరద్వాజ, దిల్ రాజు, హరి శంకర్, వందేమాతరం శ్రీనివాస్, అల్లాని శ్రీధర్, గుమ్మడి విమల సమాచార శాఖ కమిషనర్ హను మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# కలుషిత నీటితో ఇద్దరి ప్రాణాలుపోవడం బాధాకరం

### ఆందోల్ అలయ్ బలయ్‌లో మాజీమంత్రి హరీష్ రావు

**సంగారెడ్డి, అక్టోబర్ 14(నమస్తే ఉదయం):** సంగారెడ్డిలో కలుషిత నీటితో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అందోల్‌లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విజయ రామరాజు, అల్లం నవాజ్ రెడ్డి వంటి ముఖ్య నాయకులను కోల్పోవడం నిజంగా ఎంతో బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీకి చేసిన సేవలను ఎప్పటికీ మర్చిపోమంటూ వారికి నివాళుర్పించారు. అలయ్ బలయ్ పండుగ మన తెలంగాణ ఉద్యమంలో ఎంతో స్ఫూర్తిని నింపిందన్నారు. పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి, ప్రకృతిని పూజించే పండుగలు మన ఆత్మగౌరవానికి ప్రతీకలన్నారు. అన్ని కులాల వారు కలిసి బతుకమ్మ పండగను పంచుకోవడం, గ్రామాలు అంతా జమ్మి పెట్టుకుని అలయ్ బలయ్ చేసుకోవడం నిజంగా మన సంప్రదాయమన్నారు. కేసీఆర్ పాలనలో ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంగారెడ్డి లో కలుషిత నీటితో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమన్నారు. మిషన్ భగీరథ ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వం సురక్షిత నీళ్లు అందించిందని.. కానీ, ఇప్పుడు ఆ పని కూడా సరిగా చేయడంలేదని ఆరోపించారు. రైతుబంధు లేదని.. బతుకమ్మ చీరెలు లేవని.. రుణమాఫీ కూడా జరుగలేదన్నారు. డిసెంబర్ 9, పంద్రాగస్టు కూడా ముగిసిందని.. ఇంకా రుణమాఫీ కాలేదన్నారు. మంత్రులు డిసెంబర్ 9కి రుణమాఫీ చేస్తామని చెబుతున్నారని.. కానీ, ఏడాది కాలం గడిచినా అమలు చేయడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ చేసింది జమ్మి పూజ కాదు.. రాబోయే పోరాటానికి హరీశ్‌రావు ఆయుధ పూజ చేశారు అని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. రాదనుకున్న తెలంగాణనే సాధించాం.. వచ్చిన తెలంగాణను కాపాడుకునేందుకు అందరం కలిసికట్టుగా పోరాటం చేయాలని రసమయి పిలుపునిచ్చారు. నా చిన్నతనం అంతా జోగిపేటలోనే సాగింది. స్థానికులతో ఆత్మీయ సంబంధాలు ఉన్నాయి. ఎంతో తిప్పలువడి తెలంగాణ సాధించుకున్నాం.



ఇవాళ ఉద్యమ రోజులు మళ్లీ గుర్తుకు వస్తున్నాయి. బతుకమ్మ పండుగకు కేసీఆర్ బతుకమ్మ చీరలు పంపిణీ చేసేవారు. గత పదేండ్లలో దసరా, బతుకమ్మ పండుగలను గొప్పగా నిర్వహించుకున్నాం. ఇవాళ ఆ రోజుల్లేవు. ఈ ఏడాది బతుకమ్మ చీరలు ఇవ్వలేదు. ఇప్పుడు వాళ్లే కట్టుకుంటున్నారని కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి రసమయి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అలయ్ బలయ్ సందర్భంగా ఇవాళ జరిగింది జమ్మి చెట్టుకు పూజ కాదు. తెలంగాణ సాయుధ పోరాటానికి హరీశ్‌రావు ఆయుధ పూజ చేసిండు. ఈ ఆయుధాలను మళ్లా పట్టుకుందాం.. విడిచిపెట్టేది లేదు. రాదనుకున్న తెలంగాణనే సాధించాం. వచ్చిన తెలంగాణ కోసం కొట్లాడాలి. ఈ ఒక్క ఊరిలోనే దుఃఖం లేదు.. అన్ని ఊర్లలో ప్రజలు దుఃఖంతో ఉన్నారు. తెలంగాణను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఎవరితోనైతే కొట్లాడి తెలంగాణను సాధించామో.. ఇప్పుడు వాన్ని వెళ్లగొట్టే వరకు ఒక్కటిగా నిలబడాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు. భూమి సూర్యుని చుట్టు తిరుగుతున్నట్టు.. హరీశ్‌రావు తెలంగాణ చుట్టు తిరుగుతున్నాడని రసమయి బాలకిషన్ పేర్కొన్నారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733